సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం, 6, నవంబర్, 2023



అలంపూర్ ఎవరికో?

అలంపూర్ స్థానికేతరులను సైతం ఆదరించి రాజకీయ భవిష్యత్ అందించింది.

వివరాలు 10లో ▸



పోటాపోటీ ప్రచారం

కోస్గి పట్టణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారం చేశాయి.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /20.1

వాతావరణం

రోజంతా ఆకాశం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత మేఘాలు దట్టంగా కమ్ముకుంటాయి. రాత్రి చలి పెరుగుతుంది.

● అలంపూర్‌పై అనిశ్చితి

కారు.. తఖరారు!

బి – ఫారంపై కొనసాగుతున్న దోబూచులాట



అయిజలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు విజయుడు



కొర్విపాడులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఎం అబ్రహం

- నామినేషన్ల ఘట్టం మొదలైనా స్పందించని అధిష్టానం
- ఇటు అబ్రహం, అటు ఎమ్మెల్సీ అనుచరుడు విజయ్ పోటాపోటీ ప్రచారం
- పట్టు వీడని మందా.. తెరపైకి మరో ఇద్దరి పేర్లు
- తుది నిర్ణయం చెప్పేసిన కేసీఆర్.. ఇక అంతా కేటీఆర్ చేతిలో..
- ఆశావహులతో పాటు పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి తొలి నుంచీ దూకుడుగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో అన్ని పార్టీల కంటే ముందుగానే శాసనసభ స్థానాల అభ్యర్థులను ప్రకటించింది. పలు నియోజకవర్గాల్లో వ్యతిరేకత పెల్లుబికినా.. అధిక మొత్తంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం కల్పించింది. ఆయా అభ్యర్థులకు బీ–ఫారాలు అందజేసిన ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్.. నాటకీయ పరిణామాల క్రమంలో అలంపూర్‌ను పెండింగ్‌లో పెట్టిన విషయం తెలిసిందే. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంను అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ.. అసమ్మతి జ్వాల ఎగిసిపడడంతో బీఫాం ఇవ్వకుండా వాయిదా వేశారు. ప్రస్తుతం నామినేషన్ల ఘట్టం మొదలై మూడు రోజులు గడుస్తున్నా.. ఇంకా అలంపూర్ అభ్యర్థిపై సస్పెన్స్ కొనసాగుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడూ పదునైన ఆలోచన, పకడ్బందీ ప్రణాళికతో నిక్కచ్చిగా తన నిర్ణయాలను అమలుపరిచే కేసీఆర్.. ఈ సెగ్మెంట్‌లో చివరి వరకు ఉత్కంఠ రేపుతూ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్నది రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

గులాబీ శ్రేణుల్లో అయోమయం..

సీఎం కేసీఆర్ టికెట్ తనకే ఇస్తారంటూ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రచారం ప్రారంభించగా, ఆయనకు దీటుగా ఎమ్మెల్సీ చల్లా తన అనుచరుడైన విజయుడిని సైతం రంగంలోకి దింపి క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టారు. మరోవైపు బెట్టు వీడని మాజీ ఎంపీ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మందా జగన్నాథంతో పాటు కొత్తగా రిటైర్డ్ ఎంఈఓ మేరమ్మ, అలంపూర్ మున్సిపల్ చైర్మన్ మనోరమ పేర్లు తెరపైకి రావడం గులాబీశ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది.

ఎవరి పట్టు వారిదే..

అలంపూర్‌కు సంబంధించి అబ్రహంతో పాటు ఎమ్మెల్సీ చల్లా, మాజీ ఎంపీ మందాతో చర్చించాకే సమష్టి నిర్ణయంతో అసమ్మతిని చల్లార్చి ముందుకు సాగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు సీఎం కేసీఆర్ పక్షం క్రితమే సూచించినట్లు తెలిసింది. ఈ మేరకు వారు పలుమార్లు ముగ్గురు నేతలతో చర్చించినా.. ఎవరికివారు పట్టు వీడకపోవడంతో క్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. ఇదేక్రమంలో ఆది నుంచి పార్టీ అభివృద్ధి కోసం కష్టపడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్లమెంటులో ఆంధ్రా నాయకులతో యుద్ధమే చేశానని..తన కుమారుడు మందా శ్రీనాథ్‌కే టికెట్ ఇవ్వాలని మందా జగన్నాథం పట్టుబడుతుండడం మరింత జటిలమైనట్లు తెలుస్తోంది.

అలంపూర్ బంతి కేటీఆర్ చేతిలో..

అలంపూర్ నేతలు ముగ్గురితో వేర్వేరుగా జరిపిన చర్చలో వారు వెల్లడించిన అంశాలను ఇరువురు నేతలు ముఖ్యమంత్రికి చేరవేయగా.. అబ్రహంతో పాటు ఎమ్మెల్సీ చల్లా ప్రతిపాదించిన అభ్యర్థి విజయుడిపై ఆయన ఇటీవల ప్రత్యేకంగా సర్వే చేయించినట్లు సమాచారం. ఈ సర్వే ఫలితాలు అబ్రహంకే అనుకూలంగా వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో తదితర పరిణామాలు బేరీజు వేసిన కేసీఆర్ తుది నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు కేటీఆర్‌కు సరైన అభ్యర్థి పేరును సూచించడంతో పాటు ఆ ముగ్గురి మధ్య సయోధ్య కుదుర్చాలని చెప్పినట్లు తెలిసింది. ఈనెల 19న అలంపూర్‌లోనే సీఎం కేసీఆర్ బహిరంగసభ నేపథ్యంలో ఈలోపే ఫైనల్ చేసిన అభ్యర్థిని ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. మరో రెండు రోజుల్లో ఏ క్షణంలోనైనా బీఆర్ఎస్ అభ్యర్థికి పార్టీ బీఫారం అందే అవకాశం ఉంది.

ముందే పసిగట్ట లేకపోయారా..

బీఆర్ఎస్‌లో ఇది వరకే మాజీ ఎంపీ మందా జగన్నాథం, అబ్రహం మధ్య విభేదాలు ఉండగా.. చల్లా రాకతో ముచ్చటగా మూడు వర్గాలయ్యాయి. ఆధిపత్య పోరులో అబ్రహంపై చల్లా పైచేయి సాధించారు. అబ్రహంకు టికెట్ ఖరారు చేసిన క్రమంలో చల్లా వర్గీయులు పెద్ద ఎత్తున అసంతృప్తి రాజుకోవడంతో అబ్రహంకు బీఫాం ఇవ్వకుండా ఆపిన కేసీఆర్.. నియోజకవర్గ పరిస్థితిపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు. ఈ సందర్భంగా మీరంతా ఏం చేస్తున్నారంటూ ముఖ్య నేతలకు చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. ఎందుకు ముందుగా పసిగట్టలేక పోయారని ప్రశ్నించడంతో పాటు సీరియస్‌గానే క్లాస్ తీసుకున్నట్లు సమాచారం.

తెరమీదకు కొత్త పేర్లు

బీఆర్ఎస్‌లో టికెట్‌కు సంబంధించి ముగ్గురు నేతల మధ్య వివాదం కొనసాగుతుండగానే తెరమీదకు మరో ఇద్దరి కొత్త పేర్లు వచ్చాయి. సీఎం కేసీఆర్ పార్టీ పెట్టిన కొత్తలో అలంపూర్ ప్రాంతంలో మొదటగా తామే జెండా మోశామని, ఆర్టీఎస్ పాదయాత్రలో కూడా పాల్గొన్నానని అయిజకు చెందిన సింగిల్‌విండో అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోతుల మధుసూదన్‌రెడ్డి ఇటీవల చల్లా వెంకట్రామిరెడ్డితో పాటు పార్టీ ముఖ్య నేతలను కలిశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తన భార్య రిటైర్డ్ ఎంఈఓ మేరమ్మకు పార్టీ టికెట్ ఇవ్వాలని కోరారు. అలాగే అలంపూర్ మున్సిపల్ చైర్మన్ మనోరమ టికెట్ కోసం అధిష్టానం వద్ద ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కాగా.. బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయుడికి బీఫాం వచ్చిందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి వర్గీయులు సంబరాలు చేసుకున్నారు.

కాంగ్రెస్ గూటికి 'పేట' జెడ్పీ చైర్‌పర్సన్

- సరైన గౌరవం లేకనే బీఆర్ఎస్ పార్టీని వీడినట్లు వెల్లడి
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పేట జడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ

నారాయణపేట/మక్తల్: నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ ఆంజనేయులుగౌడ్ బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మక్తల్ మండలం మంథన్‌గోడు నుంచి వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులతో కలిసి మక్తల్‌కు చేరుకొని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించడంతో ఆమె అనుచర గణంతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో తాము చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆటంకం కలిగించడంతో పాటు సమావేశాలకు వెళ్తే గౌరవం ఇవ్వడం లేదన్నారు. ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరించడంతో తమకు గౌరవం లేకపోవడంతో పార్టీ వీడినట్లు వివరించారు. ఇదిలా ఉండగా మక్తల్‌లోని ఓ భూ వివాదంలో జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మధ్య విభేదాలు తలెత్తినట్లుగా చర్చ వినిపిస్తోంది. సోమవారం సీఎం కేసీఆర్ మక్తల్‌లో ఎన్నికల సభకు వస్తున్న తరుణంలో జెడ్పీ చైర్‌పర్సన్ పార్టీ వీడటం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి షాక్ ఇచ్చినట్లయింది. సర్పంచ్‌లు నర్సింహులు, లక్ష్మి, మాగనూర్ వైస్ ఎంపీపీ తిప్పయ్య, కోళ్ల వెంకటేశ్, నీలప్ప తదితరులు ఉన్నారు.

మోసపోతే.. గోసపడుతాం



గద్వాలలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్/ గట్టు: కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారని, కాంగ్రెస్ పార్టీని నమ్మితే మోసపోవడం ఖాయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు భారీ ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఆదివారం గద్వాలటౌన్‌లోని 3, 6, 16, 15వార్డులకు చెందిన బీజేపీ నాయకులు దొౌలు, ర్యాంబో, ఎంఐఎం కౌన్సిలర్ బంగిప్రియాంక ఆధ్వర్యంలో పలువురు నాయకులు, గద్వాల మండలం కొత్తపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన నివాసంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకు ముందు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. గద్వాలలో జరిగే సీఎం ఆశీర్వాద సభకు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం..

గట్టు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. బోయలగూడెంలో వాల్మీకి సంఘం మండల ప్రధాన కార్యదర్శి వీరేష్, మాజీ ఉపసర్పంచ్‌లు లక్ష్మీ, కప్పగంటి పెద్ద లక్ష్మీతో పాటుగా పలువురు యువకులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గట్టు ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కౌన్సిలర్ నరహరిగౌడ్, రాఘవేంద్ర రెడ్డి, శ్రీను, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బహుజన బిడ్డగా అవకాశం ఇవ్వండి



తారాపురంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

మల్దకల్ / గట్టు: గద్వాల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు బడుగు, బలహీన వర్గాల, బహుజన బిడ్డకు ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి, చూపుతామని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కోరారు. ఆదివారం గట్టు మండల పరిధిలోని తారాపురం, జోకనగట్టు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో, మల్దకల్ మండలంలోని తాటికుంట, పెద్దొడ్డి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు. గత పాలకులు తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకున్నారని, ప్రజల అభివృద్ధిని విస్మరించినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, కౌలు రైతులకు రూ.12 వేలు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షలు, రూ.500 కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి వాటిని అమలు చేస్తున్నట్లు చెప్పారు. బడుగు, బలహీనవర్గాల, బహుజన బిడ్డగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ, ఉద్యోగ అవకాశాలు, ప్రాజెక్టులు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, శంకర్, నల్లారెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, రామకృష్ణ, రఘుపతి, రాజశేఖర్‌రెడ్డి, గోవిందు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 4 చోట్ల..

ప్రజా ఆశీర్వాద సభలు

- బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రాక
- దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేటలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థులు, నేతలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ముమ్మర పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జడ్చర్ల, వనపర్తి, అచ్చంపేట సభల్లో పాల్గొని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నికల సంబంధించి పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను వివరించడంతో పాటు విపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టారు. దీంతో ఆయా నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఈ క్రమంలో కేసీఆర్ మరోమారు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. సోమవారం ఒక్కరోజే నాలుగు సెగ్మెంట్లలో (దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట) నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సభలకు వచ్చే ప్రజలు, బీఆర్ఎస్, అభిమానులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

షెడ్యూల్ ప్రకారం ఇలా..

నియోజకవర్గం	సమయం
దేవరకద్ర	ఉదయం 10.30 గంటలు
గద్వాల	మధ్యాహ్నం 12
మక్తల్	మధ్యాహ్నం 1.00
నారాయణపేట	మధ్యాహ్నం 2.00

ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

దేవరకద్ర..

బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాహనాల పార్కింగ్‌తో పాటు సభకు వచ్చే ముఖ్యుల కోసం బారికేడ్లతో సీటింగ్ ఏర్పాట్లు చేశారు. సభకు సుమారు లక్ష మంది తరలివస్తారని బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

గద్వాల..

జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ పక్కన ఉన్న సుమారు 12 ఎకరాల స్థలంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. సభకు సుమారు లక్ష మంది వరకు జనాలను తరలించేలా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు జిల్లా ఎస్పీ రితిరాజ్ సీఎం సభ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఆరుగు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 42 మంది ఎస్సైలతోపాటు 240 మంది కానిస్టేబుళ్లు బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు.

మక్తల్..

పట్టణంలోని ఎల్లమ్మకుంట కాలనీలో సుమారు 30 ఎకరాల స్థలంలో సభకు ఏర్పాట్లు చేశారు. సుమారు 50 వేల మంది తరలిరానున్నట్లు అంచనా. వనపర్తి ఎస్పీ రక్షితామూర్తి ఆధ్వర్యంలో తొమ్మిది సెక్టార్లుగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దాదాపు 600 మంది పోలీసులకు విధులు కేటాయించారు.

నారాయణపేట..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు చేశారు. సుమారు 50 వేల మంది వరకు జనాలను తరలించేలా బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు సన్నాహాలు చేస్తున్నారు. నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో మొత్తం 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు.

భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం..

- పలు రూట్లలో వాహనాల దారి మళ్లింపు
- అలసత్వం వహిస్తే చర్యలు: ఎస్పీ రితిరాజ్



గద్వాల సభ ప్రాంగణం వద్ద ఏర్పాట్ల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం: ప్రజా ఆశీర్వాద సభలో భాగంగా సీఎం చంద్రశేఖర్‌రావు గద్వాలకు సోమవారం రానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో పోలీసుశాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టింది. ఆదివారం సాయంత్రం ఎస్పీ రితిరాజ్ సభ ప్రాంగణం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తుకు అవసరమయ్యే సిబ్బంది తదితర విషయాలపై సిబ్బందికి వివరించారు. మీడియా, వీఐపీ, పబ్లిక్ గాలరీల ప్రదేశాల్లో సెక్టర్ల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం చేపట్టారు. హెలిపాడ్ వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీఎం బందోబస్తుకు వనపర్తి, నారాయణపేట జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీం, టెక్నికల్ సిబ్బంది ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేపట్టిన తర్వాతే సభకు అనుమతి ఇవ్వాలన్నారు. సిబ్బంది విధులుపై నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, నలుగు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 42 మంది ఎస్ఐలు, ఇతర సిబ్బంది 240 విధులు నిర్వహిస్తున్నారు.

వివిధ ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాట్లు..

సభకు వచ్చే వారికి వివిధ ప్రదేశాల్లో పార్కింగ్ ఏర్పాట్లను తీసుకున్నారు. అయిజ– మల్దకల్ రూట్‌లో వచ్చే వారు మేళ్లచెరువు చౌరస్తా వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుకోవాలి. ధరూర్ రోడ్డు మార్గంలో వచ్చే వారు నోబుల్ స్కూల్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా మేళ్లచెరువు పార్కింగ్ వద్ద, డ్యాం నుంచి వచ్చే వారు కృష్ణరెడ్డి బంగ్లా నుంచి సంగల పార్కు వద్ద, పట్టణం నుంచి వచ్చే వాహనాలు ఈదమ్మ గుడి రోడ్డు మార్గం నుంచి మేళ్లచెరువు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుకోవాలని తెలియజేశారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ సిబ్బంది సూచనలు పాటించి వారి గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–1, మైక్రోబయాలజీ–1, అప్‌లెడ్ న్యూట్రిషన్–1, శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు –1 పోస్టుల భర్తీకి ఈ నెల 8వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఈ రెండు కళాశాలలకు సంబంధించిన డెమో, ఇంటర్వ్యూలు ఈ నెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. నిబంధనల ప్రకారం సంబంధిత సబ్జెక్టుల్లో జనరల్/ బీసీలకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్/సెట్/పీహెచ్‌డీ బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు.

చిన్నన్నకు చుక్కెదురు..!

- వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థిని మార్చే యోచనలో అధిష్టానం
- మాజీ మంత్రికి బీ–ఫారం ఇవ్వని వైనం
- మేఘారెడ్డికి అవకాశం?
- రేసులో శివసేనారెడ్డి సైతం..



వనపర్తి: నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై మరోమారు సందిగ్ధం నెలకొంది. ఢిల్లీ పెద్దలు 20 రోజుల పాటు చర్చలు జరిపి చివరకు టికెట్‌ను మాజీ మంత్రి డా.జి.చిన్నారెడ్డికి ఖరారు చేస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో టికెట్లు ఖరారైన వారిలో సుమారు 70 మంది అభ్యర్థులను పిలిపించి బీ–ఫారాలు కూడా అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రకటించిన పేర్లలో మూడు నియోజకవర్గాల్లోని అభ్యర్థులను మార్చాలని అధిష్టానం నిర్ణయించగా.. అందులో వనపర్తి కూడా ఉంది. తన పేరును స్వయంగా సోనియాగాంధీ సూచించి అభ్యర్థుల జాబితాలో రాయించిందంటూ మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి తన కుమారుడితో కలిసి ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ నెల 7న నామినేషన్ దాఖలు చేసేందుకు కార్యకర్తలు, నాయకులతో చర్చలు జరిపి జన సమీకరణకు కార్యాచరణ రూపొందించుకున్నారు. ఆదివారం శ్రీరంగాపురం మండలంలో ప్రచారం కూడా చేశారు. అధిష్టానం ఇచ్చిన షాక్‌తో సాయంత్రం హుటాహుటిన హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. విషయం తెలిసి ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా అందుబాటులోకి రాలేదు.

మేఘారెడ్డికి అవకాశం..

ఇటీవల అధికార పార్టీ నుంచి బయటకు వచ్చి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరిన పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డికి కాంగ్రెస్ పార్టీ బీ–ఫారం ఇచ్చే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గంలో కొన్ని నెలలుగా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీని గ్రాండ్ లేవల్ నుంచి పైకి తీసుకొచ్చి జనంలో పేరు తెచ్చుకున్నారని, అభ్యర్థిగా మేఘారెడ్డి ఉండాలని సర్వేల్లో వెల్లడైనందుకు అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కష్టకాలంలో గెలుపు గుర్రాలకు టికెట్లు ఇచ్చి పదేళ్ల తర్వాత అధికారం చేజిక్కించుకునే ప్రయత్నాల్లో వనపర్తి అభ్యర్థి మార్పు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది.

రాహుల్‌గాంధీ ప్రకటించినా..

ఇటీవల కొల్లాపూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారసభలో వనపర్తి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి డా. జి.చిన్నారెడ్డి అంటూ స్వయంగా రాహుల్‌గాంధీ సభకు పరిచయం చేసినా.. అభ్యర్థిత్వాన్ని మార్చడంతో కాంగ్రెస్ పార్టీలో ఇవేం నిర్ణయాలనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

రేసులో శివసేనారెడ్డి..

వనపర్తి నియోజకవర్గ వాసి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి వనపర్తి టికెట్ ఆశించగా.. అధిష్టానం సూచన మేరకు మక్తల్‌లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. అక్కడ బీసీ కోటాలో వాకిటి శ్రీహరికి అవకాశం దక్కడంతో కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్నారు. తాజాగా అభ్యర్థి మార్పునకు అధిష్టానం మొగ్గు చూపడంతో యువజన కాంగ్రెస్ కోటాలో తనకు వనపర్తి టికెట్ ఇచ్చినా పర్వాలేదన్న ప్రతిపాదన మేరకు ఆయన పేరును కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నామినేషన్ దాఖలు గడువు దగ్గరపడుతున్న తరుణంలో అభ్యర్థుల మార్పుతో నియోజకవర్గంలోని కాంగ్రెస్‌పార్టీ క్యాడర్ అయోమయానికి గురవుతోంది.

కోడ్ ఉల్లంఘనలపై కేసులు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రూ.2 లక్షల ఎల్‌ఓసీ చెక్కుల పంపిణీ చేసినందుకు ఎమ్మెల్యేపై కేసు నమోదైంది. అదేవిధంగా జిల్లాలోని శ్రీపద్ కులకర్ణి, కార్తీక్, వినోద్‌తోపాటు మరో 26 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కాంగ్రెస్ నేతలు సిరాజ్‌ఖాద్రీ, వినోద్‌కుమార్, బురుజు సుధాకర్‌రెడ్డిలతోపాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సైతం కోడ్ ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు.

జోగుళాంబ ఆశీస్సులు ఎవరికో?

అలంపూర్ సెగ్మెంట్‌లో పోటాపోటీ

- ఒకప్పుడు స్థానికేరులకు పట్టం.. నేడు స్థానిక నినాదంతో ముందుకు..
- ఆధ్యాత్మిక క్షేత్రంగా ప్రత్యేక గుర్తింపు
- చేనేతలోనూ ప్రత్యేక స్థానం


అలంపూర్ ముఖచిత్రం

అలంపూర్: అలంపూర్ నియోజకవర్గం స్థానికులనే కాదు.. స్థానికేతరులను ఆదరించి రాజకీయ భవిష్యత్ అందించింది. పార్టీల ప్రభావం కంటే వ్యక్తుల ఆదరణే అధికమని రుజువు చేసింది. వలసవాదుల రాజకీయాలతో విసిగిన జనం.. ఇప్పుడు స్థానికులకే పట్టం కడుతూ వస్తున్నారు. 2004 ఎన్నికల్లో స్థానిక నినాదంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన చల్లా వెంకట్రామిరెడ్డిని గెలిపించారు. అప్పటి నుంచి స్థానికులే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారు. నియోజకవర్గ ఓటర్లకు రాజకీయ అవగాహన ఉండటంతో పోటీలో నిలిచే అభ్యర్థులు సర్వశక్తులూ ఒడ్డాల్సి వస్తోంది.

జంగ్ తెలంగాణ

1952లో నియోజకవర్గం ఆవిర్భావం..

అలంపూర్ నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. మద్రాస్ రాజధానిగా ఉన్న సమయంలో జోడు నియోజకవర్గాల్లో అలంపూర్ ఒకటిగా ఉండేది. ఆదిలోనే ఎస్సీ రిజర్వు నియోజకవర్గంగా ఏర్పడింది. ఆ తర్వాత 1953లో కర్నూల్ రాజధానిగా ఉన్న సమయంలో రెండవ ఎన్నిక, 1957లో హైదరాబాద్ రాజధానిగా ఉన్న సమయంలో మూడవ ఎన్నిక జరిగింది. 1952, 1953 ఎన్నికల సమయంలో అలంపూర్ ఎస్సీ రిజర్వుగా ఉంది. 1957లో జనరల్ స్థానంగా మారింది. అప్పట్లో అలంపూర్, మానవపాడు, ఇటిక్యాల, పెబ్బేరు (మండలంలోని కొన్ని గ్రామాలు), వడ్డేపల్లి మండలాలతో కలుపుకొని నియోజకవర్గంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో ఎస్సీ రిజర్వు స్థానంగా మారింది. అలంపూర్, మానవపాడు, వడ్డేపల్లి, రాజోళి, ఇటిక్యాల, ఉండవెల్లి మండలాలతోపాటు అయిజ మండలం అలంపూర్‌లో కలిసింది. అలంపూర్‌లో ఉన్న పెబ్బేరు మండలంలోని గ్రామాలు వనపర్తి సెగ్మెంట్‌లో చేరాయి.

17సార్లు ఎన్నికలు..

నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ 9 సార్లు విజయం సాధించింది. బీజేపీ నుంచి రావుల రవీంద్రనాథ్‌రెడ్డి 1985, 1989, 1999 ఎన్నికల్లో గెలుపొందారు. 1978లో జనతాపార్టీ అభ్యర్థి రాంభూపాల్‌రెడ్డి విజయం సాధించగా.. 1983లో రజనీబాబు, 1994లో కొత్తకోట ప్రకాష్‌రెడ్డి టీడీపీ తరఫున విజయం సాధించారు. 2004లో చల్లా వెంకట్రామిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి గెలుపొందారు. 2018లో టీఆర్ఎస్ తరఫున వీఎం అబ్రహం విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువసార్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 1952, 1978, 2004, 2009, 2014 ఎన్నికల్లో మినహా ఇక్కడ సెటిలర్స్, వలసవాదులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.

ఇక్కడి ప్రత్యేకతలు..

అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠంగా అలంపూర్ విరాజిల్లుతోంది. ఇక్కడ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామితో పాటు అనేక పురాతన ఆలయాలు ఉన్నాయి. ఇటిక్యాల మండలం బీచుపల్లిలో ఆంజనేయస్వామి క్షేత్రం ఉంది. నియోజకవర్గం చేనేతకు పుట్టినిల్లుగా పేరొందింది. రాజోళి, అలంపూర్, ప్రాగటూరు, అయిజ ప్రాంతాల్లో చేనేత వృత్తితో కార్మికులు ఈ ప్రాంత ఖ్యాతిని పెంపొందించారు. వస్త్ర ప్రదర్శన, నాణ్యత, డిజైన్‌లలోనూ బహుమతులు అందుకుంది. రాజోళిలో అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసిన ఘనత ఉంది. ఈ ప్రాంత ప్రజలకు రెండు ప్రధాన ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నాయి. ఆర్డీఎస్, జూరాల, తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఆర్డీఎస్‌తో సాగునీటి కల్పన సాధ్యం కాకపోవడంతో తుమ్మిళ్ల ఎత్తిపోతలను నిర్మించారు. అనుసంధానంగా మూడు రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉంది. అలంపూర్ నియోజకవర్గం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది.

ఓటర్ల వివరాలు..

పురుషులు:	మహిళలు:
1,16,989	1,19,080
ఇతరులు: 7	మొత్తం: 2,36,076

2014 ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్ల వివరాలు..

అభ్యర్థి	పార్టీ	ఓట్లు
సంపత్‌కుమార్	కాంగ్రెస్	57,419
వీఎం అబ్రహం	టీడీపీ	50,689
మందా శ్రీనాథ్	టీఆర్ఎస్	38,004

2018 ఎన్నికల్లో..

వీఎం అబ్రహం టీఆర్ఎస్	ఎస్‌ఏ సంపత్‌కుమార్ కాంగ్రెస్
1,02,105	57,426

హరిజన అబ్రహం ఎస్‌ఎఫ్‌బీ 8,803

1952 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలు..

సంవత్సరం	పేరు	పార్టీ	మెజార్టీ
1952	కె.నాగన్న	కాంగ్రెస్	-
1953	ఉ.ఎ.కె.నాగన్న	కాంగ్రెస్	-
1957	జయలక్ష్మీదేవమ్మ	కాంగ్రెస్	78
1962	డి.మురళీధర్‌రెడ్డి	కాంగ్రెస్	167
1967	టి.చంద్రశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	31,450
1972	టి.చంద్రశేఖర్‌రెడ్డి	కాంగ్రెస్	22,170
1978	చల్లా రాంభూపాల్‌రెడ్డి	జనతా	125
1983	రజనీబాబు	టీడీపీ	2,968
1985	రావుల రవీంద్రనాథ్‌రెడ్డి	బీజేపీ	12,201
1989	రావుల రవీంద్రనాథ్‌రెడ్డి	బీజేపీ	10,372
1994	కొత్తకోట ప్రకాష్ రెడ్డి	టీడీపీ	1,964
1999	రావుల రవీంద్రనాథ్‌రెడ్డి	బీజేపీ	30,254
2004	చల్లా వెంకట్రామిరెడ్డి	స్వతంత్ర	4,247
2009	వీఎం అబ్రహం	కాంగ్రెస్	1,183
2014	ఎస్‌ఏ సంపత్‌కుమార్	కాంగ్రెస్	6,730
2018	వీఎం అబ్రహం	టీఆర్ఎస్	44,679

మొదటి ఎమ్మెల్యే డాక్టర్ నాగన్న



అలంపూర్ మండలం లింగనవాయికి చెందిన కలవండ్ల డాక్టర్ నాగన్న మొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ తరఫున నాగన్న, స్వతంత్ర అభ్యర్థిగా జమ్మన్న పోటీపడగా.. నాగన్న విజయం సాధించారు. 1953లో నిర్వహించిన ఉప ఎన్నికలోనూ డాక్టర్ నాగన్న కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలుపొందారు.

అత్యధిక, అత్యల్ప మెజార్టీలు..



1957లో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోరు సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి జయలక్ష్మీదేవమ్మకు 13,345 ఓట్లు పోలవ్వగా.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన జనార్దన్‌రెడ్డికి 13,267 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో జయలక్ష్మీదేవమ్మ కేవలం 78 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1962 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి మురళీధర్‌రెడ్డి కేవలం 158 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1978లో జనతాపార్టీ అభ్యర్థి చల్లా రాంభూపాల్‌రెడ్డి 125 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి వీఎం అబ్రహంకు 1,02,105, కాంగ్రెస్ అభ్యర్థి ఎస్ఏ సంపత్‌కుమార్‌కు 57,426 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం 44,679 ఓట్ల మెజార్టీని సొంతం చేసుకున్నారు.

చేరికల జోరు..

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లోకి పోటాపోటీ చేరికలు


పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఈశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

- తాజాగా కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అనుచరులు
- అధికార పార్టీలో నాగం చేరిక ఎఫెక్ట్
- కొల్లాపూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నేతలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లాలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోకి నేతల చేరికలు జోరందుకుంటున్నాయి. ఇరు పార్టీలు పోటాపోటీగా చేరికలపై దృష్టి పెట్టడంతో పదుల సంఖ్యలో నేతలు శరవేగంగా పార్టీలు మారుతున్నారు. తాజాగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అనుచరుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, మల్కాపూర్ సర్పంచ్, ఎంపీటీసీ లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ యాదగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ గూటికి చేరారు. ఆదివారం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలసి వీరంతా హైదరాబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇటీవల మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో ఆయనకు వ్యతిరేకంగా ఉన్న వర్గం కాంగ్రెస్‌లో చేరేందుకే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. అధికారపార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి నాయకుల చేరికల నేపథ్యంలో ఆపార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

నాగం చేరిక నేపథ్యంలో..

మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఇటీవల బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో మొదటి నుంచి ఆయనకు వ్యతిరేకంగా ఉండి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నవారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆయన వ్యవహారశైలి నచ్చకనే తాము పార్టీని వీడాల్సి వచ్చిందని కాంగ్రెస్‌లో చేరిన నేతలు చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రెండు పర్యాయాలు ఒక కుటుంబానికే అవకాశం కల్పించడం, నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన పనులకు ఏళ్లుగా బిల్లులు పెండింగ్‌లోనే ఉండటం తదితర విషయాలపై ఆయన అనుచరుల్లో కొంతమంది అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారపార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరికల అంశం చర్చనీయాంశంగా మారింది.

పెద్ద నాయకులకు గాలం..

బీఆర్ఎస్‌లోని ముఖ్య నాయకుల చేరికలపై కాంగ్రెస్ దృష్టి సారించింది. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఆ పార్టీ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే కొల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ మహముదా బేగం, పెద్దకొత్తపల్లి జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరరావు, ఎత్తం కృష్ణయ్య తదితరులు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నిజామొద్దీన్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటికే మున్సిపాలిటీ కౌన్సిలర్ లావణ్య వెంకటేశ్, ఉప్పునుంతల, అచ్చంపేట జెడ్పీటీసీలు మంత్యా నాయక్, ప్రతాప్‌రెడ్డి, ఉప్పునుంతల ఎంపీపీ అరుణ నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీఎంరెడ్డి, అచ్చంపేట వైస్‌ఎంపీపీ అమరావతి, మార్కెట్ వైస్‌చైర్మన్ చంద్రశేఖరరెడ్డి తదితరులు కాంగ్రెస్ గూటికి చేరారు.

పోటాపోటీగా చేరికలు..



జిల్లాలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోకి నిత్యం పోటాపోటీగా నేతల చేరికలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పెద్ద ఎత్తున నాయకుల చేరికలపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఎన్నికల ప్రచారంతో పాటు నిత్యం ఏదో ఒక చోట పార్టీలోకి చేరికలు ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఆయా ఆపార్టీల్లో అసంతృప్త నేతలను గుర్తించడం, వారేం ఆశిస్తున్నారో తెలుసుకుని తమదైన శైలిలో తాయిలాలతో వారిని ఆకట్టుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో ఇతర పార్టీల్లోని నాయకులను చేర్చుకుని తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు.

పోటాపోటీ ప్రచారం


కోస్గిలో కిక్కిరిసిన శివాజీ చౌరస్తా

- రెండుగంటల పాటు నిలిచిన వాహనాల రాకపోకలు
- వీడియో చిత్రీకరణకే పరిమితమైన పోలీసులు

కోస్గి: పట్టణంలోని శివాజీ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీ ప్రచారం నిర్వహించాయి. ఆదివారం వారంతపు సంత ఉండటంతో కాంగ్రెస్‌పార్టీ ప్రచార వాహనం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో రోడ్డు పక్కన నిలిపి కళాకారులతో ప్రచారం ప్రారంభించారు. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార వాహనం సైతం వచ్చి చౌరస్తాలోనే మరోవైపు నిలిపి పోటీగా ప్రచారం చేయడం, పాటలకు ఇరుపార్టీల కార్యకర్తలు పెద్దఎత్తున జెండాలతో వాహనాల ముందు నిలిచి నృత్యాలు చేయడం కనిపించింది. దీంతో పాలమూర్–తాండూర్, కోస్గి–నారాయణపేట రహదారికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి రాకపోకలు స్తంభించాయి. అక్కడికి చేరుకున్న పోలీసులు సైతం చేసేది లేక వాహనాల వివరాలు సేకరిస్తూ దృశ్యాలను చిత్రీకరించడానికే పరిమితమయ్యారు. అదే సమయంలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన మరో రెండు వాహనాలు, బీఆర్ఎస్‌కు చెందిన మరో రెండు వాహనాలు రావడంతో ఆ ప్రాంతమంతా ఆటపాటలతో దద్దరిల్లింది. ఎట్టకేలకు పోలీసులు రంగంలోకి వారితో వారించి వాహనాలను అక్కడి నుంచి పంపించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులు నానాఅవస్థలు పడాల్సి వచ్చింది. ఏదేమైనా వారాంతపు సంతరోజున అటు వ్యాపారులు, ఇటు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు..

'మా ఇంట్లో ఓటు అమ్మకానికి లేదు.. కొనడానికి ఎవరూ రావొద్దు' అని వనపర్తి జిల్లా కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఓ ఇంటికి బోర్డు ఏర్పాటు చేశారు. దినసరి కూలీపని చేసుకుంటూ పిల్లలను చదివించే సామాన్యుడు.. ఎన్నికల పోకడను గమనించి ఇంటి గేట్‌కు బోర్డు ఏర్పాటు చేయడం కాలనీవాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విషయం సోషల్ మీడియాలో ఆదివారం హల్‌చల్ కావడం గమనార్హం. – వనపర్తి


ఇంటి గేటుకు ఏర్పాటు చేసిన బోర్డు

ప్రాణం తీసిన విహారయాత్ర


ముడుమాల్ నదికి ఈ వాహనాల్లో వెళ్లిన విద్యార్థులు


మృతిచెందిన అభిషేక్

- కృష్ణానదికి పిక్నిక్ వెళ్లిన కరాటే విద్యార్థులు
- క్రికెట్ ఆడుతుండగా నీటిలో పడిన బంతి
- బాల్‌ను తీసుకరావడానికి వెళ్లి నీటిలో మునిగి విద్యార్థి మృతి

కృష్ణా: కృష్ణానదిలో ప్రమాదవశాత్తు అభిషేక్(13) ఆదివారం మధ్నాహ్నం నీటిలో మునిగి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయచూర్‌లో కరాటే మాస్టర్ వీరేష్ వద్ద వివిధ పాఠశాలలకు చెందిన 34 మంది విద్యార్థులు కరాటే నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా వారంతా సరదాగా పిక్నిక్ వెళ్దామని అనుకున్నారు. కృష్ణా మండలంలోని ముడుమాల్ వద్ద బీచ్‌లా ఉంటుందని రెండు వాహనాల్లో ఆదివారం అక్కడకు చేరుకున్నారు. ఉదయం నుంచి నదిలో స్నానాలు ముగించుకుని భోజనాలు చేశారు. ఆ తరువాత తోటి స్నేహితులతో కలిసి నదిలోని ఇసుకలో క్రికెట్ ఆడుకుంటున్నారు. కాగా క్రికెట్ బాల్ కాస్త పక్కన ఉన్న నీటిలో పడిపోయింది. ఆ సమయంలో అభిషేక్ (విశ్వేశ్వర హై స్కూల్ చంద్రబండ రాయచూర్ విద్యార్థి) ఆ బాల్‌ను తీసుకొచ్చేందుకు వెళ్లి నీటిలో పడిపోయాడు. నీటి ప్రవాహం ఉండటంతో కొద్ది దూరం కొట్టుకుపోయాడు. విహారయాత్రకు వచ్చిన కొందరు యాత్రికులు విద్యార్థిని వెతికి తీసుకొచ్చారు. అప్పటికే విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎస్ఐ విజయభాస్కర్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

క్షణంలోనే ప్రమాదం జరిగింది..



విద్యార్థులు నదిలోని ఇసుకలో సరదాగా ఆడుకుంటున్నారు కదా అని అనుకున్నాం. కాని ఇంతలోనే క్రికెట్ బాల్‌ను తీసుకెళ్లిన అభిషేక్ నీటిలో మునిగి మృతిచెందాడు. మేము వెంటనే వెళ్లి బయటకు తీసినా ప్రాణాలను కాపడలేకపోయాం. – వీరేష్, కరాటే మాస్టర్

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 1,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు వదలగా.. మరో 99 క్యూసెక్కులు ఆవిరైంది. దీంతో ప్రాజెక్టు నుంచి మొత్తం 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.447 టీఎంసీల నీరు నిల్వ ఉందని వివరించారు.

కాంగ్రెస్‌కు షాక్..

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం గుడ్‌బై

- అదే దారిలో యువనేత కొండా ప్రశాంత్‌రెడ్డి..
- నేటి సభలో కేసీఆర్ సమక్షంలో ప్రదీప్ బీఆర్ఎస్‌లో చేరే అవకాశం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో కొండా భేటీ
- కమలం నుంచి పోటీ చేసేందుకు యత్నాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దేవరకద్ర నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. నియోజకవర్గ హస్తం టికెట్ ఆశించి భంగపడిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అంతేకాదు మరో ఆశావహనాయకుడు, యువనేత కొండా ప్రశాంత్‌రెడ్డి సైతం అదే దారిలో పయనించడం సెగ్మెంట్‌లోని కాంగ్రెస్ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. అయితే దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థిగా జి.మధుసూదన్‌రెడ్డిని ప్రకటించిన క్రమంలో అటు కాటం, ఇటు కొండా సంయుక్తంగా తమ అనుచరులతో భేటీ అయి అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. కానీ ఆ తర్వాత పరిణామాల క్రమంలో కాటం తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తుండగా.. కొండా బీజేపీ వైపు చూస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

అనుచరులతో కాటం భేటీ..

దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థిగా మార్చాలని పార్టీ కార్యాలయంలో నిరసన తెలిపిన కాటం ప్రదీప్ కుమార్‌గౌడ్.. అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆదివారం ఆయన తన అనుచరులతో భూత్పూర్ మండలంలోని ఓ ప్రముఖ నాయకుడి ఫామ్ హౌస్‌లో సమావేశమయ్యారు. సీనియార్టీకి విలువ ఇవ్వకుండా కొత్తగా వచ్చిన నాయకునికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో పాటు ఏ పార్టీలోకి వెళ్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాల అధ్యక్షులు రాందాసు, వెంకటేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, టీపీసీసీ నాయకులు వేణుగోపాల్, దేవరకద్ర మాజీ ఎంపీపీ భగవంతగౌడ్, లాల్‌కోట ఎంపీటీసీ శివరాజు, ఓబీసీ జిల్లా నాయకులు బాల్‌చందర్‌గౌడ్, మైనార్టీ నాయకులు ఫసియొద్దీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, క్రాంతిగౌడ్, అక్కి రాఘవేంద్రగౌడ్‌తో పాటు పలువురు కార్యకర్తలు హాజరు కాగా.. కాంగ్రెస్‌ను వీడాలని ముక్తకంఠంతో నినదించారు. ఈ మేరకు కాటం తనతో పాటు తన అనుచరులు కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు మీడియా సమావేశంలో ప్రకటించారు. ధనార్జనే ధ్యేయంగా కాంగ్రెస్ టికెట్లను అమ్ముకున్నారని ఈ సందర్భంగా ధ్వజమెత్తారు.

నేటి ఆశీర్వాద సభలో బీఆర్ఎస్‌కు..?

30 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉన్నానని, పార్టీని నమ్ముకున్న వారి పట్ల రాష్ట్ర నాయకత్వం విలువ ఇవ్వకపోవడం చాలా బాధకరంగా ఉందని కాటం సమావేశంలో వ్యాఖ్యానించారు. తన అనుచరులు, కార్యకర్తల కోరిక మేరకు పార్టీని వీడుతున్నట్లు వెల్లడించారు. వారి అభీష్టం మేరకు ఏ పార్టీలో చేరుతామనే విషయం త్వరలో ప్రకటిస్తామని ఆయన వెల్లడించినప్పటికీ.. బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇదివరకే గులాబీ నేతల నుంచి ఆహ్వానం అందగా.. సోమవారం దేవరకద్రలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో కాటంతో పాటు ఆయన అనుచరులు కారెక్కనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.


మద్దతుదారులతో సమావేశమైన కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో కొండా ప్రశాంత్‌రెడ్డి

కొండా ప్రశాంత్‌రెడ్డి బీజేపీలోకి?

కాంగ్రెస్ దేవరకద్ర నియోజకవర్గ టికెట్ ఆశించి భంగపడిన టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండా ప్రశాంత్‌రెడ్డి బీజేపీలో చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి జీఎమ్మార్‌ను మార్చాలని డిమాండ్ చేస్తున్న ఆయన ఆదివారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది. ఇన్నాళ్లుగా పార్టీలో కష్టపడుతూ సేవలందిస్తున్నానని.. తనకు పార్టీలో ప్రాధాన్యం కల్పించేలా పదవి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. సరైన స్పందన రాకపోవడంతో ఆయన బీజేపీ వైపు మొగ్గుచూపి.. తన అనుచరులతో కలిసి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి పోటీకి విముఖత చూపుతున్న నేపథ్యంలో ఆయన బీజేపీ టికెట్ ఆశించి.. ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. బీజేపీ కూడా ఈ నియోజకవర్గంలో బలమైన నాయకుని కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ అసమ్మతి నేత కొండా ప్రశాంత్‌రెడ్డి కమలం తీర్థం పుచ్చుకునేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. అన్ని అనుకూలిస్తే హైదరాబాద్‌లో ప్రధానమంత్రి మోదీ సభలో ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం.